కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా. 11, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 45, పందిరి బీర 38, క్యాబేజీ 13, క్యారెట్ 32, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 18, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 28, చామగడ్డ 41, మొరంగడ్డ 28, కందగడ్డ 63, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 10–12, ముల్లంగి 4–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆర్టీఏ మెంబర్‌గా సురేష్‌లాల్


మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సురేష్‌లాల్

లాలాపేట: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు నేతికార్ సురేష్‌లాల్ ఇటీవల తెలంగాణ రాష్ట్ర రీజినల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతను నిస్వార్థంగా క్రమశిక్షణతో నిర్వహిస్తానని అన్నారు.

పదవీ విరమణ వయసు తగ్గించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ ఉద్యోగుల వయస్సును 62 నుంచి 58 సంవత్సరాలకు తగ్గించాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ మోతిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ప్లకార్డులు పట్టుకొని నిరసన ప్రదర్శన చేశారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లు ఉండటం వలన నిరుద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరూర్‌నగర్ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియంకాగాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని లేని పక్షంలో అదే స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య



సికింద్రాబాద్: రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బొల్లారం – బొల్లారం బజార్ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలో శనివారం ఉదయం 5 గంటల సమయంలో సుమారు 25–30 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, వైట్ కలర్ షర్ట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసం

మెంగళరావునగర్: ఉద్యోగం పేరుతో మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కాచిగూడకు చెందిన కె.వేణుగోపాల్‌రెడ్డి వ్యాపారం చేస్తుంటాడు. అతడి సోదరుడైన నరేందర్‌రెడ్డి ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్‌లో పనిచేసే నరేందర్‌రెడ్డి స్నేహితుడు ప్రవీణ్ వరంగల్‌కు చెందిన వేల్పుల నగేష్‌ను పరిచయం చేశాడు. నగేష్ తనకు రూ.2లక్షలు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తానని నరేందర్‌రెడ్డికి తెలిపాడు. దీంతో నరేందర్‌రెడ్డి మూడు విడతలుగా రూ.2 లక్షలు ఇచ్చాడు. నగదు తీసుకున్న నగేష్ బ్లూఫోనిక్స్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీస్ అనే సంస్థలో జిల్లా కోఆర్డినేటర్‌గా నరేందర్‌రెడ్డికి ఉద్యోగం ఇప్పించాడు. అయితే గత ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఉద్యోగం చేసినప్పటికీ ఒక్క రూపాయి కూడా జీతం ఇవ్వలేదు. ఇదేమని ప్రశ్నించగా ఇటీవల నగేష్ తన సంస్థను మూసివేసి పారిపోయాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన నరేందర్‌రెడ్డి అతడి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

బంజారాహిల్స్: హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారనే కారణంగా ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగానే బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని అగ్రసేన్ చౌరస్తాలో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఏఎస్ఐ బాగేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో హెల్మెట్ పెట్టుకోకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకుని జరిమానాలు, విధించడమే కాకుండా మరోసారి హెల్మెట్ లేకుండా తిరగవద్దని కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు దాటేదెలా?


మెట్ల మార్గానికి అడ్డంగా పార్క్ చేసిన కారు..


ఎర్రగడ్డ ఎఫ్ఓబీ వద్ద పనిచేయని లిఫ్ట్

సనత్‌నగర్: మెట్రోరైల్ కింది రహదారి పొడవునా డివైడర్..ఎక్కడో ఒక చోట ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ)ల నిర్మాణం..అక్కడక్కడా యూటర్న్‌లు.. ట్రాఫిక్ సిగ్నల్స్.. ఇవే పాదచారికి రోడ్డు దాటే అవకాశాలు. ఎఫ్ఓబీలు మినహాయించి యూటర్న్, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రోడ్డు దాటాలంటే పాదచారులు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకోవాల్సిందే. ఎందుకంటే ఒకదాని వెనుక మరొకటి దూసుకు వచ్చే వాహనాలను తప్పించుకుని రోడ్డుదాటాలంటే హడలెత్తిపోవాల్సిందే. ఈ క్రమంలో అపసోపాలు పడుతూ సుదూర ప్రాంతాల్లోని యూటర్న్‌ల వద్దకు వెళితే..అక్కడ కూడా లెక్కకు మిక్కిలిగా వచ్చే వాహనాలను తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు కోకొల్లలు. అయితే రోడ్డు దాటే పాదచారుల అవస్థలకు చెక్ పెట్టేందుకు ఫుడ్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ)ల నిర్మాణాలను జీహెచ్ఎంసీ చేపట్టింది. అయితే వాటి ద్వారానైనా సురక్షితంగా రోడ్డు దాటుదామంటే పాదచారులకు అక్కడ కూడా చేదు అనుభవమే ఎదురవుతుంది. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, మహిళల కోసం లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటుచేస్తే అవి పనిచేయడం లేదు. ఫలితంగా వారి అవస్థలు వర్ణనాతీతం.

- మోడల్‌కాలనీ కమాన్ వద్ద , బేగంపేట హెచ్‌పీఎస్ ఎదురుగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్వహణ లోపం కారణంగా రోడ్డు దాటే పాదచారులకు అవస్థలు తప్పడం లేదు.

ఎఫ్ఓబీల నిర్వహణ గాలికి

- పనిచేయని లిఫ్టులు..ఎస్కలేటర్లు..
- వృద్ధులు, దివ్యాంగులు, మహిళల ఇబ్బందులు..
- బేగంపేట, ఎర్రగడ్డ వద్ద ఎఫ్ఓబీల నిర్వహణ అధ్వాన్నం..

మోడల్‌కాలనీ వద్ద పనిచేయని లిఫ్ట్.. అక్కరకు రాని ఎస్కలేటర్..

మోడల్‌కాలనీ కమాన్ వద్ద ఎఫ్ఓబీ లిఫ్ట్ అసలే పనిచేయడం లేదు. మరోవైపు ఉన్న ఎస్కలేటర్ పనిచేస్తున్నా అటువైపు వెళ్లే మార్గం కూడా లేకపోయింది. వాహనాల అక్రమ పార్కింగ్ ఒకవైపు.. ఇంకోవైపు బస్‌షెల్టర్ వద్ద యాచకుల నివాసం.. వెరసి ఎస్కలేటర్ వైపు వెళ్లేందుకు అవకాశమే లేకుండాపోతుంది. పోనీ మెట్ల మార్గాన వెళదామంటే మెట్లకు అడ్డంగా కార్లను పార్క్ చేయడం ఇదేమీ ఖర్మ అంటూ పాదచారులు ఆవేదనకు గురవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పసి పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రగడ్డ రైతుబజార్, చర్చి, రాష్ట్ర స్థాయి ఆస్పత్రులతో పాటు ఇరువైపులా ఉన్న పలు కాలనీల ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా కోట్లాది రూపాయలతో ఇక్కడ ఎఫ్ఓబీని నిర్మించారు. ఎస్కలేటర్లు, లిఫ్టులు

- అందుబాటులో లేనప్పుడు కోట్లు వెచ్చించి ఎందుకు నిర్మించారని పలువురు వాపోతున్నారు.


ఎర్రగడ్డ ఎఫ్ఓబీ ఎస్కలేటర్ వద్ద వాహనాల పార్కింగ్..


బేగంపేట హెచ్‌పీఎస్ వద్ద ఎఫ్ఓబీ వద్ద రెండువైపులా పనిచేయని లిఫ్టులు



బేగంపేటలో ఎఫ్ఓబీ ఇలా..

బేగంపేట హెచ్‌పీఎస్ వద్ద గత నాలుగేళ్ల క్రితం ఏర్పాటుచేసిన ఎఫ్ఓబీ లిఫ్ట్ పనిచేయడం లేదు. బేగంపేట మహిళా డిగ్రీ కళాశాల, హెచ్‌పీఎస్, మహర్షి విద్యాలయ సంస్థలతో పాటు మయూరిమార్గ్, అల్లంతోటబావి, శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రాంత నివాసితులు రోడ్డు దాటేందుకు వీలుగా ఈ ప్రాంతంలో ఎఫ్ఓబీ ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే లిఫ్ట్ పనిచేయకపోవడంతో ఎత్తైన బ్రిడ్జిని ఎక్కాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆయా ఎఫ్ఓబీల నిర్వహణను పకడ్బందీగా చేపట్టి లిఫ్టులు, ఎస్కలేటర్లను అందుబాటులోకి తీసుకురావాలని పాదచారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు


కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతూ ప్రజాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం స్థానిక కార్పొరేటర్ కె. హేమలతతో కలిసి పలు ప్రజాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. పద్మారావునగర్ వెంకటాపురం కాలనీలో రూ. 40లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన కమ్యూనిటీహాల్ పనులను, బోయిగూడ టింబర్ డిపో లైన్‌లో రూ. 20లక్షలతో వేయనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. వెంకటాపురం కాలనీలో పలు ప్రజాసమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం పార్కును అభివృద్ధి చేశామని, నూతన డ్రైనేజీ పైపులైన్‌ను వేయించామని వివరించారు. కాలనీ వాసుల సౌకర్యార్థం నూతన కమ్యూనిటీహాల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలు సూచించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, జలమండలి జీఎం వినోద్, టౌన్‌ప్లానింగ్ డీసీసీ సుష్మిత, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు జి. పవన్‌కుమార్ గౌడ్, ఏసూరి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు వజీర్ మోహన్, పద్మిని, ఆశ, విజయలక్ష్మీ, గజలక్ష్మీ, వెంకటరమణ, రాజు, ఈసీ రావు తదితరులు పాల్గొన్నారు.

న్యూబోయిగూడలో ..

బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ ఉప్పలమ్మ దేవాలయం ప్రాంతంలో శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి పర్యటించారు.

రేషన్‌కార్డుల సర్వేలో దళారుల జోక్యాన్ని నివారించండి


బేగంపేట సర్కిల్ డీసీ సమ్మయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న మర్రి పురురవారెడ్డి తదితరులు

సనత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వేతో పాటు వివిధ పథకాల సర్వేల్లో అక్కడక్కడా దళారుల జోక్యం చేసుకుంటున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని, దీనిని అరికట్టాల్సిందిగా బీజేపీ రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవరెడ్డి జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యకు విజ్ఞప్తి చేశారు. శనివారం బేగంపేట సర్కిల్ కార్యాలయంలో డీసీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం జరుగుతున్న రేషన్‌కార్డుల సర్వేను నిష్పక్షపాతంగా జరిపించాల్సిందిగా కోరారు. సర్వేలో నిజమైన లబ్ధిదారులకు ఎక్కడా అన్యాయం జరగకుండా చూడాలని, అందుకు అవసరమైతే ఆయా ప్రాంతాల్లో అఖిలపక్ష నాయకుల సహకారం తీసుకోవాలని సూచించారు. బీజేపీ సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, కృష్ణ, అంబాలా ఈశ్వర్‌బాబు, కుమార్, కిరీట, వికాస్, నరేష్, దొండే సురేష్, పార్శి పరమేష్ తదితరులు ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఎంవీ ఫౌండేషన్, బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు

కంటోన్మెంట్: బాలకార్మిక నిర్మూలన దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బాలకార్మిక వ్యవస్థను అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని కోరుతూ ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు, బాలల హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థలకు సంబంధించి తాము తయారుచేసిన నివేదికను ఎమ్మెల్యేకు అందించారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మరి కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు సరిగా లేకపోవడం వల్ల విద్యార్థులు మధ్యలోనే బడి మానేస్తున్నారన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలను తాను స్వయంగా పరిశీలిస్తానని, ఎలాంటి సమస్యలున్నా తాను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛంద బాలల హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, సువర్ణ ఎంవి ఫౌండేషన్ ప్రతినిధులు దుర్గ, రమాదేవి పాల్గొన్నారు.

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడిపై ఫిర్యాదు


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బౌద్ధనగర్: మందకృష్ణ మాదిగను కించ పరిచేలా మాట్లాడిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసూల రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు బుంజూరు విజయ్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో రామ్మూర్తిపై ఎమ్మార్పీస్ నాయకులు ఫిర్యాదు చేశారు. రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వారికి ఈ దేశంలో ఉండే అర్హత లేదని, రెచ్చగొట్టే మాటలు మాట్లాడినందుకు వెంటనే అతనిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పు మల్లికార్జున్, సత్యనారాయణ, పాండు, సాయికుమార్, మురళీధర్ పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తిపై ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ముశేఖర్‌మాదిగ శనివాసం ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యక్తిగతంగా రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యాఖ్యానించిన రామ్మూర్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నేతలు శ్రీనివాస్‌మాదిగ, అజిత్ కళ్యాణ్, వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

20న హుండీల లెక్కింపు

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర దేవాలయం హుండీలను ఈనెల 20న లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.నరేందర్‌రెడ్డి తెలిపారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో జరిగే లెక్కింపు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, ఆలయ ఫౌండర్ ట్రస్టీ,స్థానిక భక్తులు,దాతలు కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

గణపతి దేవాలయంలో సినీ నటుడు రానా పూజలు


దేవాలయం నుంచి బయటకు వస్తున్న నటుడు రానా

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో సినీ నటుడు రానా ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం ఆయన దేవాలయానికి రాగా ఆలయ అర్చకులు గోత్రనామాలతో పూజలు చేసి ఆశీర్వచనంతో పాటు తీర్థ ప్రసాదాలు అందించారు. బలగం సినిమా హీరో ప్రియదర్శి పులికొండ నటిస్తున్న ఏషియన్స్ ఫిల్మ్స్ ఆధ్వర్యంలోవస్తున్న ఈ సినిమాను రానా క్లాప్ కొట్టి రానా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ సందీప్‌రెడ్డి, యాంకర్ సుమ, దేవాయదాయ శాఖ ఉప కమిషనర్, ఈవో రామకృష్ణతో పాటు పలువురు సిని ప్రముఖులు పాల్గొన్నారు.

బస్తీ సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: బాలల సంఘం ప్రతినిధులు ప్రస్తావించిన బస్తీ సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు అప్సా స్వచ్ఛంద సంస్థ, ఇంద్రధనస్సు బాలల సంఘం ఆధ్వర్యంలో శనివారం లాలాపేట వినోభానగర్‌లో చైల్డ్ ఫ్రెండ్లీ వార్డు ప్రజాప్రతినిధులు, అధికారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి డిప్యూటీ మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలల సంఘం ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ బస్తీల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు. సమావేశంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ డీఈ వెంకటేష్, ఇంజనీరింగ్ ఏఈ వేణు, జలమండలి మెనేజర్ మురళి పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి పాటుపడాలి

లిబర్టీ: కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమానికి పాటుపడాలని బీసీ దల్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. రాజ్యాంగబద్ధమైన హక్కు లు, సామాజిక న్యాయం అందించాలని కోరుతూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను దుండ్ర కుమారస్వామి గన్‌పార్క్ వద్ద శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ గ్రూప్‌లో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శా ఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ లోతుగా అధ్యయనం చేసి బీసీ–ఏ జాబితాలో చేర్చి ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని విన్నవించారు.

నిబంధనలు పాటిస్తేనే రహదారి ప్రమాదాల నియంత్రణ


నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ సంపత్‌కుమార్

చిలకలగూడ: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యపడుతుందని ఈస్ట్, సెంట్రల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా శనివారం మెట్టుగూడ ఆలుగడ్డబావి వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఫ్రీలెఫ్ట్ వెళ్లే వాహనాలకు అడ్డుతగిలితే జరిమానా తప్పదన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలు, వాహనదారులకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వాహనచోదకులు, ప్రయాణీకులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ ఏసీపీ సంపత్‌కుమార్, చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్

సాక్షి, సిటీబ్యూరో: 20వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. చంద్రశేఖర్ రెడ్డి, నంద్యాల నరసింహారెడ్డి సత్తా చాటుతున్నారు. పురుషుల 50 ప్లస్ సింగిల్స్‌లో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ప్రీ క్వార్టర్స్‌లో మహ్మద్ అసిఫ్‌పై అలవోక విజయం సాధించి సెమీ ఫైనల్స్‌లో అడుగు పెట్టారు. నరసింహారెడ్డి 8–7 తో సాయి గణేశ్‌పై ఉత్కంఠ మ్యాచ్‌లో పైచేయి సాధించారు. సాంబశివా రెడ్డి 8–3తో శివ ప్రసాద్ రెడ్డిపై గెలుపొంది క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపారు. లగడపాటి శ్రీధర్ 8–1తో రాజా రామ్ మోహన్‌పై నెగ్గారు. పురుషుల 60 ప్లస్ సింగిల్స్‌లో రామ్ రెడ్డి 8–0తో జవహర్‌పై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. సికింద్రబాద్ క్లబ్ వేదికగా దేశవ్యాప్తంగా 220 మంది వెటరన్ క్రీడాకారులు పోటీపడుతున్న ఈ టోర్నమెంట్‌లో ఆదివారం ఫైనల్స్ జరుగనున్నాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి సంజీవనిలా పనిచేస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని 36 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయం నిధి కింద మంజూరైన చెక్కులను పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. నగర వ్యాప్తంగా కొత్తగా చేపట్టిన మూడు తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)ను ఏడాదిలోపే పూర్తిచేయనున్నట్లు తెలిపారు. వైద్యం కోసం ప్రభుత్వ సహకారం కోరుకునే స్థానికులు పికెట్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో తమ దరఖాస్తులు సమర్పించాలన్నారు.

మ్యాన్‌హోళ్ల మరమ్మతుకు స్పెషల్ డ్రైవ్



మారేడుపల్లి జలమండలి కార్యాలయం

సికింద్రాబాద్: జలమండలి మారేడుపల్లి డివిజన్ పరిధిలో మ్యాన్‌హోళ్ల మరమ్మతుల కోసం అధికారులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. రానున్న రోజుల్లో తాగునీరు, మురుగునీటి సమస్యలకు పరిష్కార మార్గం చూపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మ్యాన్‌హోళ్ల పరిస్థితుల కారణంతో మురుగునీరు, తాగునీటి పారుదలలో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో మ్యాన్‌హోళ్ల పైకప్పులు పగిలిపోవడం, శిథిలావస్థకు చేరడం, మురుగునీటి మ్యాన్‌హోళ్ల పక్కన్నే తాగునీటి మ్యాన్‌హోల్స్ ఉండి తాగునీరు కలుషితం కావడం వంటి సమస్యలు సమూలంగా పరిష్కరించేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని జలమండలి ఉన్నతాధికారులు ప్రవేశపెట్టారు. వాస్తవానికి గత డిసెంబర్ వరకే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలనుకున్నప్పటికీ సాంకేతిక కారణాల నేపథ్యంలో మరమ్మతు పనులు పూర్తి చేయడం సాధ్యం కాలేదు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ నెలాఖరులోగా మ్యాన్‌హోళ్ల మరమ్మతు, కొత్త మ్యాన్‌హోళ్ల నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

హామీల అమలులో చిత్తశుద్ధి కరువు


భూగర్భడ్రైనేజీ పైపులైను పనులను ప్రారంభిస్తున్న రామకృష్ణ

రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నీటి మూటలే అని అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు అన్నానగర్‌లో బోర్డు నిధులతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు సమీపంలో ఉన్న క్లాసిక్‌గార్డెన్‌లో ఉన్న విషపూరితమైన చెట్ల కారణంగా బస్తీవాసులు అనారోగ్యాలకు గురవుతున్నారని వాటి వేర్ల కారణంగా భూమిలో నుంచి ఇండ్ల పునాది పెకలి స్తోందని ఆ చెట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బిఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.